సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 18 । మే । 2023



'డబుల్' ఇళ్లలో వసతుల్లేవ్!
ఆత్మకూర్(ఎం)లో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.
- 9లో



ముగిసిన మండల స్థాయి పోటీలు
సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.
- 9లో

గరిష్ఠం/కనిష్ఠం
41°/27°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలీసెట్


హాల్‌టికెట్‌లను పరిశీలిస్తున్న సిబ్బంది

భువనగిరి : జిల్లాలో బుధవారం జరిగిన పాలీసెట్ – 2023 ప్రశాంతంగా జరిగింది. యాదగిరిగుట్టలో రెండు, భువనగిరిలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 1,670 మంది విద్యార్థులకు 1,545 మంది హాజరయ్యారు. 125 మంది గైర్హాజరైనట్లు పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ షఫియాజ్ అక్తర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ కృష్ణ, తహసీల్దార్ జయపాల్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు నవీన్‌కుమార్ తనిఖీ చేశారు.

వేడుకగా నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం నిత్య కల్యాణం వేడుకగా చేపట్టారు. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేసిన తర్వాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, శ్రీస్వామివార్లకు నిత్య కల్యాణం పాంచరాత్రా ఆగమశాస్త్ర ప్రకారం చేపట్టారు. సాయంత్రం మాడ వీధిలో జోడు సేవలను ఊరేగించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని మూసివేశారు.

కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌కు స్వర్ణపతకం


బంగారు పతకంతో అంబోజు అనిల్‌కుమార్

భువనగిరి : దక్షిణకొరియాలో జరుగుతున్న ఏషియన్ పసిఫిక్ మాస్టర్ గేమ్స్–2023లో భువనగిరి పట్టణానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్‌కుమార్‌కు 3వేల మీటర్ల రన్నింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. ఇక్కడ జరుగుతున్న పోటీల్లోనే ఇప్పటికే 800 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం సాధించారు. తాజాగా స్వర్ణ పతకం సాధించడంతో క్రీడాకారులు, పోలీసులు ఆయనను అభినందించారు. మొత్తం మూడు విభాగాల్లో పాల్గొని రెండు పతకాలు సాధించి జిల్లా కీర్తిని చాటారు.

రైతుబజార్‌లో తనిఖీ


వినియోగదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భువనగిరి : పట్టణంలోని రైతుబజార్‌ను బుధవారం ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అధికారులతో మాట్లాడారు. అనంతరం 30 వార్డు పరిధిలోని మహదీనగర్‌లో పర్యటించారు. వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, నర్సింగ్‌నాయక్, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ నాయకులు గోపాల్, పాల్గొన్నారు.

'మహిళా హక్కులను హరిస్తున్న బీజేపీ'

నల్లగొండ టౌన్: మహిళల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరించివేస్తుందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు. నల్లగొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా నల్లగొండ జిల్లా శిక్షణ తరగతులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు విద్య, క్రీడలు, రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకెళ్తుంటే వారిని శాసించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు, మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఎండలకు భద్రం!

సెగలు కక్కుతున్న భానుడు
- 14 మండలాల్లో 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదు
- అత్యధికంగా వలిగొండలో 44.4 డిగ్రీలు
- బయటకు రావద్దని వైద్యుల హెచ్చరిక
- పెంపుడు జంతువుల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలని సూచన


మధ్యాహ్నం 2 గంటల సమయంలో జనసంచారం లేక నిర్మానుష్యంగా భువనగిరి పట్టణం

సాక్షి, యాదాద్రి : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గడిచిన వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతకు వడగాడ్పు, ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం జిల్లాలో అత్యధిక వలిగొండలో 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు ఇదే రికార్డుస్థాయి ఉష్ణోగ్రతగా చెప్పవచ్చు. ఉదయం 9 గంటలకు మొదలైన ఎండ సాయంత్రం 5 దాటినా తగ్గడం లేదు. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు అస్వస్థతకు గురవుతున్నారు. పారిశ్రామిక వాడల్లో పని చేసే కార్మికులు, రోజు కూలీలు, చిరు వ్యాపారులు, కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు ఎండవేడిమికి అల్లాడుతున్నారు. మనుషులతో పాటు పెంపుడు జంతువులు, పక్షులు విలవిలలాడుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో ఇళ్లలోనుంచి బయటకు రావద్దని వైద్యారోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులతో పాటు బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇళ్లలో ఉన్న వారు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలు,కూలర్ల కొనుగోలు విద్యుత్ వినియోగం పెరిగింది. శీతల పానియాల అమ్మకాలు అమాంతం పెరిగాయి.

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత	మండలం	ఉష్ణోగ్రత
వలిగొండ	44.4	అడ్డగూడూరు	41.2
రామన్నపేట	43.1	మోటకొండూరు	41.1
గుండాల	42.5	ఆలేరు	41.0
చౌటుప్పల్	42.2	యాదగిరిగుట్ట	40.8
భువనగిరి	41.4	బీబీనగర్	40.6
మోత్కూరు	41.4	నారాయణపురం	40.3
బొమ్మలరామారం	41.3	ఆత్మకూర్(ఎం)	40.2
		పోచంపల్లి	39.5
		తుర్కపల్లి	39.4
		రాజాపేట	38.1





బయటకు వెళ్లవద్దు

- ఎండ తీవ్రత దృష్ట్యా బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులున్న వారు వీలైనంత వరకు బయటకు వెళ్లొద్దు.
- బయటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరగకుండా చూసుకోవాలి.
- ఇంటి, రూం టెంపరేచర్ పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండ సమయంలో వాకింగ్, రన్నింగ్ చేయవద్దు. ఎండలో వ్యాయామం చేయడం వల్ల హార్ట్ పంపింగ్ ఎక్కువ జరుగుతుంది. శరీరంలోనుంచి బయటకు వచ్చే చెమట ద్వారా పొటాషియం ఎక్కువగా విడుదల అవుతుంది. తద్వారా హార్ట్ బీట్ పెరిగి గుండె నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ఆరుబయట పనులకు కూడా వెళ్లవద్దు.



- ఉదయం ఎండ తీవ్రత పెరగ ముందే వ్యాయామం ముగించాలి. వెంటనే ఎలక్ట్రాల్ పౌడర్ నీటిని తీసుకోవాలి.
- రోజు తీసుకునే నీటికంటే అదనంగా మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలి.
- చల్లదనం కోసం ఏసీలు, కూలర్లు వాడాలి.
- ఆల్కహాల్, కాఫీ, టీతో పాటు శీతల పానీయాలు ఎక్కువగా తీసుకోవద్దు.
- ఆహారంలో కూరగాయలు ఎక్కువగా అధికంగా ఉండేలా చూసుకోవాలి.
- మాంసాహారం, మసాలలతో కూడిన ఆహారం తీసుకోవద్దు.
- వదులు కాటన్ దుస్తులకు వేసుకోవాలి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి.
- మధ్యాహ్నం 12నుంచి 3 గంటల వరకు ఎండ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో శారీరక శ్రమ చేయొద్దు.
- ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు, టవల్ వంటి రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి.
- శరీరం డీ హైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి.

-డాక్టర్ మహ్మద్ ఓవైస్, ఫిజీషియన్, గుండె, షుగర్ వైద్య నిపుణులు, భువనగిరి

మూగజీవాలకు నీళ్లు, నీడ వసతి కల్పించాలి



పెంపుడు జంతువులు, పక్షుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాటికి తరచూ దాహార్తి తీర్చడంతో నీడ వసతి కల్పించాలి. మున్సిపాలిటీలు, పంచాయతీల ఆధ్వర్యంలో తొట్లు ఏర్పాటు చేసి వాటిలో ఎప్పుడూ నీటిని నిల్వ ఉంచాలి. ఇళ్లు, కార్యాలయాల వద్ద నీళ్లు, నీడ సౌకర్యం ఉండాలి. ప్రధానంగా చిలుకలు, పావురాలు, కుందేళ్లు ఉండకు తట్టుకోలేవు. వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, కోతులు, పక్షుల సంరక్షణ కోసం కారుణ్య చర్యలు చేపట్టాలి.

-డాక్టర్ వి.కృష్ణ, జిల్లా పశువైద్యాధికారి

వడదెబ్బ అతి ప్రమాదకరం

- శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల సెల్సీయస్ వద్ద ఉండేలా మెదడులో థర్మోస్టాట్ మాని టరింగ్ చేస్తుంది. ఎండకు వెళ్లినప్పుడు మెదడుపై ఎండ ఎఫెక్ట్ ఎక్కువ పడి మెదడలో ఉండే థర్మోస్టాట్ పనిచేయడం మానేస్తుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 100నుంచి 104 డిగ్రీల వరకు పెరిగి వడ దెబ్బ తగులుతుంది. వడదెబ్బ తగిలితే వెంటనే ప్రాథమిక వైద్యం తీసుకోవాలి.
- వడదెబ్బకు గురైనప్పుడు తలనొప్పి, దాహం ఎక్కువగా ఉంటుంది. చమట పట్టడం, చర్మం పొడిబారుతుంది. వెంటనే నీడకు తరలించి ఎలక్ట్రాల్ పౌడర్ నీటిని తాగించాలి.
- నిస్సత్తువ, నీరసం, కళ్లు తిరగడం, మానసిక స్థితిలో మార్పు వస్తుంది. మరోస్థాయిలో మాట రాకపోవడం, ఏం చేస్తున్నారో అర్థం కాకపోవడం, బీపీ పెరగడం, మాటతీరు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటి వారిని వెంటనే నీడకు చేర్చి చల్లని గాలి వచ్చే విధంగా చూడాలి. శరీరాన్ని తడి బట్టతో తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్ నీటిని తాగించాలి. రక్త ప్రసరణ బాగా జరిగేలా కాళ్లు ఎత్తున పెట్టి పడుకోబెట్టాలి. స్పృహలో ఉంటే చల్లటి నీరు తాగించాలి. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకుపోవాలి.
- 28 డిగ్రీల ఉష్ణోగ్రత శరీరానికి ఎంతో అనుకూలం. 33 నుంచి 36 డిగ్రీలు ఉన్నా బయటి వాతావరణం, తడిగా, పొడిగా ఉన్న వాతావరణం ఒబ్బందిగా అన్పిస్తుంది.



- వాటర్ మిలన్, కొబ్బరినీళ్లు, పైనాపిల్, పుచ్చకాయ, మజ్జిగ, పండ్ల రసాలు తాగాలి
- చిన్నపిల్లల శరీరం తట్టుకోదు. బయటకు తీసుకెళ్లినప్పుడు ఎక్కువగా ద్రవపదార్థాలు తాగించాలి. చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. ఆడుకోవడానికి సాయంత్రం వేళల్లో పంపించాలి. షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఎండ ఉందని కార్లలో దిలి వెళ్లకూడదు. బయట వేడిమికంటే కార్లలోనే ఉండే వేడి ఎక్కువగా ఉంటుంది.
- గర్భిణులు వైద్య పరీక్షలకు ఉదయమే పోవాలి. ఎండ వేడిమి వల్ల తల్లి, కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. భోజనంలో కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. దుంపకూరలు, మసాలాలు తగ్గించుకోవాలి. ఉదయం, సాయంత్రం మాత్రమే చిన్నచిన్న వ్యాయమాలు చేయాలి.వ్యాయామం పూర్తి కాగానే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీటిని తాగాలి. సంత్ర, మోసంబి, నిమ్మ విటమిన్ సీ ఎక్కువగా ఉన్న పండ్ల రసాలు తాగాలి. బాలింతలు చాలా జాగ్రత్తగా ఉండాలి.

-డాక్టర్ పద్మజాదివాకర్, స్త్రీ వైద్య నిపుణులు, భువనగిరి

31లోపు పనులన్నీ పూర్తి కావాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- మన ఊరు – మన బడి పనులపై సమీక్ష

భువనగిరిటౌన్ : మన ఊరు – మన బడి పనులను మే31వ తేదీ లోపు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమై పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు.రూ.30లక్షల నుంచి కోటి రూపాయల వరకు టెండర్లు పూర్తికాని పాఠశాలల్లో పనులను స్కూల్ యాజమాన్య కమిటీలకు అప్పగించి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అంతేకాకుండా ఎంబీలను త్వరగా రికార్డ్ చేసి బిల్లులు చెల్లించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి ఆండాలు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇంజనీర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఉపాధిహామీ పనుల పరిశీలన

భువనగిరి : మండలంలోని అనాజిపురంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, ప్రకృతి వనాన్ని సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సర్పంచ్, నాయకులు ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు వాయిదా వేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాల విజ్ఞప్తి మేరకు 3, 4, 5, 6 సెమిస్టర్లు (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరిటౌన్ :తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 19, 21, 22 తేదీల్లో నిర్వహించనున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని, సకాలంలో బస్సులు నడపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ కిట్‌లతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. తనిఖీల సమయంలో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని నియమించాలని, పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దన్నారు. అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్‌గా భూదాన్‌పోచంపల్లి తహసీల్దార్‌ను నియమించినట్లు వెల్లడించారు. చీఫ్ సూపరింటెండెంట్లు 18వ తేదీన భూదాన్‌పోచంపల్లి వద్ద ఉన్న విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అభ్యర్థులను అరగంట ముందుగా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌ఐఆర్‌డీ బృందం

- మహిళా సంఘాల పనితీరుపై అధ్యయనం

సాక్షి,యాదాద్రి : ఎన్‌ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్), బరోడా బ్యాంకు బృందం బుధవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలెక్టరేట్‌లో కలిశారు. స్వయం సహాయక మహిళా సంఘాల పనితీరుపై తెలుసుకున్నారు. బ్యాంకు రుణాలతో సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న తీరు, చేపడుతున కార్యక్రమాలపై కలెక్టర్ వారికి వివరించారు. అదే విధంగా యాదగిరిగుట్ట మండలంలోని మసాయిపేట గ్రామాన్ని ఎన్‌ఐఆర్‌డీ బృందం సందర్శించింది. గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. బ్యాంకు రుణాలు పొందే విధానం, ఆన్‌లైన్‌లో చెల్లింపులు, డిజిటల్ చెల్లింపులు, జీవనోపాధులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సమైక్య సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో మహిళా సంఘాల వివరాలు, సాధికారతపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్డీఓ నాగిరెడ్డి, అడిషనల్ పీడీ జోజప్ప సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

సమస్యలు పరిష్కరించకపోతే 5నుంచి సమ్మె

భువనగిరి : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 5నుంచి సమ్మె చేస్తామని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య తెలిపారు. రేషన్ డీలర్ల సమలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా రేషన్ డీలర్ల సమస్యలను పట్టించుకునేవారే లేరన్నారు. అనేకమార్లు పోరాటాలు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు మన్నె యాదగిరి, మండల అధ్యక్షుడు మహేష్, సభ్యులు నోముల అంజనేయులు, యుగేందర్, రమేష్, పిట్టల అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

భరోసా ఇవ్వని 'ఉపాధి'!

- గిట్టుబాటు కాని కూలి
- ఖాతాల్లో సకాలంలో జమ కాని నగదు
- పనులకు వెళ్లడానికి అనాసక్తి
- రోజురోజుకూ తగ్గుతున్న కూలీలు

మోటకొండూరు : పేదల కడుపు నింపడం, వలసల నివారణ కోసం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం భరోసా ఇవ్వలేకపోతోంది. కూలి గిట్టుబాటు కాపోవడం, సకాలంలో డబ్బులు అందకపోవడం, అలవెన్స్ కూడా ఇవ్వకపోవడంతో కూలీలు ఉపాధిహామీ పనులపై అనాసక్తి కనబరుస్తున్నారు. పనులకు వెళ్లే కూలీల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది.

జాబ్ కార్డులు, పనిదినాలు ఇలా..

2021– 22 సంవత్సరంలో జిల్లాలో 81,562 కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉన్నాయి. ఆయా కుటుంబాలు 37,12 480 రోజులు పని చేయగా అందులో 6,165 మంది మాత్రమే 100 రోజులు పూర్తి చేశారు. 2022 – 23లో 84,501 కుటుంబాలకు చెందిన కూలీలు 33,04,500 రోజులు పనుల్లో పాల్గొన్నారు. అందులో 999 మంది కూలీలు మాత్రమే 100 రోజుల పనని చేశారు. కేంద్రం కూలీలకు ఇస్తున్న ధర పెంచినప్పటికీ రూ.100లోపే గిట్టుబాటు అవుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని వేసవి అలవెన్స్

గడ్డపార, పారకు పదును పెట్టడానికి చార్జీలు, మంచినీటికి అలవెన్స్ ఇస్తుండేవారు. ప్రస్తుతం అలవెన్స్ అందడం లేదు. కూలీలు సొంత డబ్బులతో గడ్డపార, పారకు పదును పెట్టిస్తున్నారు. ఇళ్ల వద్దనుంచి నీటిని తీసుకెళ్తున్నారు. అంతేకాకుండా వేసవిలో పని చేసే చోట కూలీలు సేద దీరడానికి టెంట్లు ఏర్పాటు చేయాలి. కూలీలు గాయపడితే ప్రథమ చికిత్స అందజేయడానికి మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలి. వేసవిలో వడదెబ్బకు గురవకుండా ఓఆర్‌ఎస్ ప్యాకుట్లు ఉంచాలి. కానీ, అవి ఎక్కడా కనిపించడం లేదు.

ఆధార్‌తో అనుసంధానం అయితేనే..

ఏడాది క్రితం వరకు ఉపాధికూలీ పనులను రాగస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా మానిటరింగ్ చేసేవారు. కొంతకాలంగా ఎన్‌ఐసీ (నేషనల్ ఇన్ఫార్‌మెటిక్స్ సెంటర్) అనే యాప్ ద్వారా పూర్తిగా కేంద్రమే పర్యవేక్షిస్తుంది. కూలీల హాజరు, పనుల కొలతలు ఇతర వివరాలన్నీ యాప్ ద్వారా ఏరోజుకారోజు ఉన్నతాధికారులకు పంపాలి. కానీ, యాప్‌లో సాంకేతిక సమస్యలు, సిగ్నల్స్ అందకపోవడం, సిబ్బందికి అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కూలీలకు వచ్చే డబ్బుల్లో కోత పడుతుందని వారు వాపోతున్నారు. దీనికి తోడు ఆధార్‌కు ఫోన్‌నంబర్ అనుసంధానం ఉన్న కూలీల ఖాతాల్లో మాత్రమే నగదు జమ అవుతుంది. ఇంకా 20శాతం మంది కూలీల ఫోన్ నంబర్లు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. వీరు పనులకు వెళ్లినా డబ్బులు జమ కావడం లేదు.


మోటకొండూరు మండలం కాటేపల్లి శివారులో ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలు

నాలుగు నెల్లుగా పైసలు వస్తలేవు



గత నాలుగు నెలల క్రితం చేసిన పనికి ఇంత వరకు డబ్బులు రాలేదు. పని చేసే చోట వసతులు కూడా కల్పించడం లేదు. ఎండకు కూలీలు ఇబ్బంది పడుతున్నారు. సౌకర్యాలు కల్పించడంతో పాటు కూలీలకు వెంటనేవెంటనే డబ్బులు పడేలా చూడాలి.

– మంత్రి అయిలమ్మ, ఉపాధి కూలీ, కాటేపల్లి

పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. బడ్జెట్‌లో తక్కువ ప్రాధాన్యం ఇస్తూ 33శాతం నిధులను తగ్గించటం విచారకరం .ఉపాధిపనులు జరిగే చోట వసతులు కూడా లేకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీల పట్ల సానుకూలంగా ఉండాలి.

–సురపంగ శివలింగం, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర : మండల పరిధిలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, 01-06-2006 నుంచి 01-07-2008 మధ్య జన్మించిన విద్యార్థులు ప్రవేశపరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్‌సైన్స్ సబ్జెక్టులలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష జూలై 22న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి


జిట్ట లింగమ్మ (ఫైల్)

చిట్యాల: వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన చిట్యాల పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన జిట్ట లింగమ్మ(60) కొంతకాలంగా స్థానిక ఆలయాల ఎదుట భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మూడు రోజులుగా వీస్తున్న వేడి గాలులతో పాటు, ఎండ వేడిమికి తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం రాత్రి మృతిచెందింది. లింగమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని కోరారు. మృతదేహాన్ని ప్రజాసంఘాల నాయకులు జిట్ట చంద్రయ్య, బొందయ్య, కృష్ణ, నర్సింహ, యాదయ్య సందర్శించి నివాళులర్పించారు.

గడ్డిలోడు డీసీఎం దగ్ధం

వలిగొండ : షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డిలోడు డీసీఎం దగ్ధమైంది. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. పశువుల పెంపకందారుడు గోగు శంకర్ మండలంలోని దాసిరెడ్డిగూడెంలో బుధవారం గడ్డిని కొనుగోలు చేసి డీసీఎంలో లోడు చేసుకున్నాడు. అనంతరం హైదరాబాద్ సమీపంలో గోశాల వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో గ్రామ శివారులో డీసీఎంకు విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. గడ్డితో పాటు డీసీఎం కూడా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలు ఆర్పివేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ అధికారులు అశోక్, బాబు, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

తె'ల్లారి'న బతుకులు

- రోడ్డుప్రమాదంలో ఆరుగురు మహిళా కూలీలు దుర్మరణం
- మృతులంతా నల్లగొండ జిల్లా వాసులే
- ఆటోను లారీ ఢీకొనడంతో దుర్ఘటన
- ఆర్తనాదాలతో మార్మోగిన ఘటనా స్థలం

కూలి కోసం కొండంత ఆశతో వేకువజామునే బయలుదేరిన ఆ పేద బతుకులపై విధి కన్నెర్రచేసిందో ఏమో.. కబుర్లు చెప్పుకుంటూ సరదాగా ఆటోలో వెళ్తున్న మహిళలపైకి ఒక్కసారిగా లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. ఫలితంగా అప్పటివరకు సాగిన ముచ్చట్లు ఆహాకారాలుగా మారాయి. కొద్దిసేపాగితే పని ప్రదేశానికి చేరుకుంటారనగా ఈ ఘోరం జరగడంతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. విషయం తెలిసి గుండెలు బాదుకుంటూ వచ్చిన బంధువుల రోదనలతో దిక్కులుపిక్కటిల్లాయి. ఈ హృదయ విదారక ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దాచేపల్లి మండలం పొందుగల వద్ద బుధవారం జరిగింది.




సంఘటనా స్థలంలో కూలీల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

దాచేపల్లి : దామచర్ల మండలం నర్సాపురానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు బుధవారం వేకువ జామునే గురజాల మండలం పులిపాడులో జరుగుతున్న మిర్చి కోతలకు ఆటోలో పయనమయ్యారు. ఆటో దాచేపల్లి మండలం పొందుగల వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో మాలోతు కవిత(45), ఇస్లావత్ మంజుల(30), భూక్యా పద్మ(26), భూక్యా సోనీ(58), వర్తియా సక్రీ(35) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఇస్లావత్ పార్వతి(45)తోపాటు మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పార్వతిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మిగిలిన వారిని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు

ప్రమాదంలో మరణించిన ఆరుగురి కుటుంబాలదీ రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితే. నర్సాపురంలోని సుగాలీ కాలనీకి చెందిన వీరంతా ఉన్న ఊరిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిపాడు గ్రామానికి కొన్నిరోజులుగా వస్తున్నారు. రోజులాగానే బుధవారం తెల్లవారుజామునే ఆటోలో 12మంది మహిళా కూలీలు పనులకు బయలుదేరారు. మార్గమధ్యలో ప్రమాదం జరిగి ఆరుగురు మరణించారు. తెల్లవారుజామునే ఇంట్లో నిద్రిస్తున్న బిడ్డలకు ముద్దు ఇచ్చి పనికి ఎల్తాన్న.. అంటూ చిరునవ్వుతో బయలుదేరిన వీరిని ఘటనాస్థలంలో విగతజీవులుగా చూసి వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

అమ్మా ఒక్కసారి లేమ్మా..

మంజుల కుమార్తె నాగమణి ఘటనాస్థలంలో రోదించిన తీరు చూపరులను కలచివేసింది. 'బిడ్డా కూలిపోయొస్త.. మధ్యాహ్నానికి వచ్చేస్త అని చెప్పావు కదమ్మా.. లెగమ్మా.. నాన్నా అమ్మను ఓ సారి లెగమను' అంటూ ఆమె విలపించిన తీరు కంటతడి పెట్టించింది. తండ్రి రంగా బిడ్డను అక్కున చేర్చుకుని ధైర్యం చెప్పినా ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. మంజులకు నాగమణితోపాటు కుమారుడు ఈశ్వర్ ఉన్నారు.

- అలాగే ప్రమాదంలో మరణించిన కవితకు భర్త, కృష్ణ, కుమార్తెలు అంజలి, సరిత, కుమారుడు ధనుష్ ఉన్నారు.
- పద్మకు భర్త భిక్షు, కుమారులు దీపక్, విక్షన్, సక్రికి భర్త సక్రు, కుమార్తెలు అంజలి, దేవిక ఉన్నారు.
- సోనీ భర్త చనిపోవడంతో కుమారుల వద్ద ఉంటూ కూలిపనులకు వస్తోంది.

ఒకవైపే రోడ్డు.. ఆపై ఆగి ఉన్న లారీలు

ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న ధాన్యం లారీలను సరిహద్దు వద్దే తెలంగాణ ఆర్టీఓ అధికారులు నిలిపివేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి లారీలను నిలిపివేయటంతో పొందుగల గ్రామంలోనూ రోడ్డు పక్కనే లారీలు నిలిచాయి. పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ధ్యానం లారీలను దాటుకుంటూ వెళ్తున్న నేపథ్యంలో ఎదురుగా తెలంగాణ నుంచి కూలీలతో వస్తున్న ఆటోను గమనించకపోవటంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ధాన్యం లారీలు నిలిపివేయకుంటే ఈ ప్రమాదం జరిగేదికాదని పేర్కొంటున్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

గురజాల : ప్రమాదంలో మరణించిన ఐదుగురి మృతదేహాలకు గురజాల వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తయింది. దీంతో పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

పరామర్శించిన ఎమ్మెల్యే కాసు, జానారెడ్డి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

మృతదేహాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి , ఉమ్మడి రాష్ట్ర హోంశాఖ మాజీ మంత్రి కుందురు జానారెడ్డి సందర్శించారు. అనంతరం మృతుల బంధువులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కూలీల మృతి బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబసభ్యులకు, చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు వారు ఆర్థికసాయం అందించారు. ప్రమాద వివరాలను డీఎస్పీ పల్లపురాజును అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఝెను ముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్


ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఈ ప్రమాదంలో క్షతగాత్రులైన వారిని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ

మిర్యాలగూడ: కూలీలు మృతిచెందిన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద తీవ్రతను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఆయన అందజేశారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాం నాయక్, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు వీరకోటిరెడ్డి, ఎండీ యూసుఫ్, ఎంపీటీసీ బాలలక్ష్మీసత్యనారాయణ, పెద కోటిరెడ్డి, ధీరావత్ పాచు నాయక్ ఉన్నారు.


మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: జూలకంటి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. మృతుల కుంటుబ సభ్యులను, క్షతగాత్రులను బుధవారం ఆయన పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం నాయకుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, వినోద్ నాయక్, పాపానాయక్ దయానంద్ తదితరులు ఉన్నారు.

బీఎల్ఆర్ ఆర్థికసాయం

ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న యాంకర్ సుమ


స్వామివారి ఆలయంలో సుమ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని యాంకర్ సుమ బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠాలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. కాగా.. ఆలయ పరిసరాల్లో, కృష్ణ శిల మండపాల్లో యాంకర్ సుమ రెండు గంటల పాటు డాక్యూమెంటరీని చిత్రీకరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిలో భాగమైన యాదాద్రీశుడి ఆలయాన్ని చూపెట్టేందుకు సుమ డాక్యూమెంటరీ చేసినట్లు తెలుస్తోంది.

ఎడ్లబండి కిందపడి వృద్ధుడు మృతి

- ఐదు నిమిషాల్లో ఇంటికి చేరతాడనగా విషాదం
- మాడ్గులపల్లి మండలం తోపుచర్లలో ఘటన


జీవయ్య (ఫైల్)

మాడుగులపల్లి : ఎడ్లబండితో సాయంత్రం ఇంటిముఖం పట్టిన వృద్ధుడు మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడు అనుకుంటుండగా.. ఊహించని రీతిలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటన మండలంలోని తోపుచర్ల గ్రామంలో మంగళవారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సామ జీవయ్యను(65) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జమ్మి వేసుకొచ్చేందుకు పనికి పిలిచాడు. ఇద్దరూ ఎడ్లబండిలో జమ్మి వేసుకొని ఇంటికి బయల్దేరారు. పనికి పిలిచిన వ్యక్తి తొట్లో కూర్చోగా.. జీవయ్య బండి ముందు నడుస్తున్నాడు. మార్గమధ్యలో ఈదురుగాలికి టేబుల్ పేపర్ (శుభకార్యాల్లో భోజనానికి ముందు టేబుల్‌పై పరిచే కవర్) పెరపెరలాడుతూ ఎద్దుల బండి వైపు దూసుకొచ్చింది. ఒక్కసారిగా ఎద్దులు బెదిరి ముందుకు దౌడు తీయడంతో పోలు కర్ర తగిలి జీవయ్య కిందపడిపోయాడు. ఈ క్రమంలో బండి అతడి పైనుంచి వెళ్లడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు హుటాహుటిన మిర్యాలగూడలోని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా, మృతుడి కుటుంబాన్ని బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్, సర్పంచ్ మంగ యాదయ్య పరామర్శించారు. జీవయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హుజూర్‌నగర్‌రూరల్ : వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. హుజూర్‌నగర్ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతారాంపురం వద్ద గల వేమూలూరి వాగులో గ్రామానికి చెందిన గంటసాల రామాంజనేయులు, ఉర్లుగొండ వెంకన్న చేపల వేటకు వెళ్లారు. కాగా, వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో గ్రామ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బిక్కేరులో చెక్‌డ్యాంలు నిర్మించాలి

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని బిక్కేరులో చెక్‌డ్యాంలు నిర్మించాలని, ఇసుక తరలించవద్దని కోరుతూ కొప్పుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండగడప గ్రామస్తులు బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల క్రితం కొండగడపలో హెల్త్ సబ్ సెంటర్, సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్ చెక్‌డ్యాం నిర్మాణం కోసం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బిక్కేరు వెంట సుమారు 400 బోర్లు ఉన్నాయని, చెక్‌డ్యాం నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి వాటికి మరింత నీరు లభిస్తుందన్నారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. దీక్షలో మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రబెల్లి మల్లమ్మ, మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి యాదయ్య, కొప్పుల శ్రీధర్‌రెడ్డి, పసునూరి వెంకట్‌రెడ్డి, కొమ్ము రాములు, తొంట తిరుపయ్య, నోముల రమేష్, పొన్నగాని యాదగిరి, లెంకల అవిలుమల్లు, లెంకల యాదగిరి, బోడ చంద్రయ్య, గజ్జెల్లి మహేష్, భారతమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మద్దతు

కొండగడప గ్రామస్తులు చేపట్టిన దీక్షకు మోత్కూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. మద్దతు ప్రకటించిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, కొప్పుల కరుణాకర్‌రెడ్డి, సురేష్, అన్నెపు వెంకన్న, తొట్ల యాదగిరి, బందెల రవి, ఉయ్యాల అంజయ్య, బుర్ర యాదయ్య, అన్నెపు నర్సింహ ఉన్నారు.

భార్య మృతికి కారణమైన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

చిట్యాల: భార్య మృతికి కారణమైన భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ కోర్టు అసిస్టెంట్స్ సెషన్స్ జడ్జి తోజే కార్తీక్ తీర్పునిచ్చినట్లు చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మా బుధవారం తెలిపారు. కేసుపై ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన జోగి కృష్ణయ్య అలియాస్ కృష్ణతో కట్ట రాములు కుమార్తె అండాలుకు 2006లో వివాహం జరిగింది. వివాహ సమయంలో కృష్ణకు రూ.1.20లక్షలు కట్నంగా అందజేశారు. ఏడాది పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. అనంతరం భార్యపై అనుమానం పెంచుకున్న కృష్ణ ఆమెను మానసికంగా శారీరకంగా వేధించాడు. దీంతో భర్త వేధింపులకు మనస్తాపం చెందిన అండాలు 2013 డిసెంబర్ 16న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే నెల 21న మృతిచెందింది. దీంతో మృతురాలి తండ్రి అదే రోజున చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వివరించారు. సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్. మోహన్‌బాబు, యాదగిరి, ఎస్ఐ ధర్మా, పీపీ జయరాంనాయక్‌ను ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ : భువనగిరి ఎస్వోటీ పోలీసులు దాడులు చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కొండ మెట్ల దారిలో కొందరు రహస్యంగా పేకాట ఆడుతున్నారని ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.81వేలు ఐదు సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

చింతపల్లి : వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. చింతపల్లి, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన పున్న ఆంజనేయులు(59) గ్రామంలోని దర్జీగా జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య, పిల్లలు నాలుగేళ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు మూడు రోజుల క్రితం తాను పనిచేస్తున్న దుకాణంలోనే పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆంజనేయులు కనబడకపోవడంతో బుధవారం అతని తమ్ముడి కుమారుడు అనుమానం వచ్చి దుకాణం వద్దకు వెళ్లాడు. దుర్వాసన వస్తుండడంతో దుకాణం తెరవగా ఆంజనేయులు మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బాలకృష్ణ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి..


చంద్రారెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన రెగట్టె చంద్రారెడ్డి (45) ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. చంద్రారెడ్డి కొన్నేళ్లుగా చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో జరుగుతున్న తగాదాలతో చంద్రారెడ్డి మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లోనుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా, బుధవారం మండల పరిధిలోని శేరుబావిగూడెం సమీపంలో రైల్వే పట్టాల పక్కన చంద్రారెడ్డి బైక్ కనిపించింది. గ్రామస్తులు గమనించగా రైలు పట్టాలపై చంద్రారెడ్డి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే కానిస్టేబుల్ రజిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట నుంచి మల్లాపురం వెళ్లే ప్రధాన రహదారిలో గల ప్రగతి వెంచర్ సమీపంలో రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఇంకా లభించలేదని, కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలియజేశారు.

సర్పంచ్‌పై కేసు

మోతె : మోతె మండలం గోపతండా సర్పంచ్‌తో పాటు మరొకరిపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. గోపతండా సర్పంచ్ కొర్ర తిరుపతి, డ్రైవర్ సురేష్‌తో కలిసి మంగళవారం మండల కేంద్రం నుంచి ట్రాక్టర్‌పై 950 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 22 లీటర్ల సారాను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు ట్రాక్టర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సర్పంచ్ తిరుపతి, డ్రైవర్ సురేష్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ అప్సర్ అలీని ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం తిరుపతి, సురేష్ ట్రాక్టర్‌ను వదిలి అక్కడినుంచి పారిపోయారు. ఆ ట్రాక్టర్‌ను ఎక్సైజ్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బుధవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న ఏడుగురి అరెస్ట్

- ద్విచక్రవాహనదారులే టార్గెట్‌గా చేసుకుని దాడులు
- నిందితులను కోర్టులో హాజరుపర్చిన అనంతగిరి పోలీసులు

అనంతగిరి : రోడ్డు మీద వెళ్తున్న అమాయక ద్విచక్ర వాహనదారులే టార్గెట్‌గా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను అనంతగిరి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్, మౌలాలీ, షేక్ అబ్దుల్లా, ప్రశాంత్, గోపిరెడ్డినగర్‌కు చెందిన శీలం శ్రీరామ్, బంజారకాలనీకి చెందిన ఆఫ్రీది, నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన బసవబోయిన గోపికృష్ణ ఓ ముఠాగా ఏర్పడి దోపిడీలకు పాల్పడుతున్నారు.

ప్రయాణికుల వలే నిల్చొని..

ఈ ముఠా సభ్యులు కోదాడ బైపాస్‌రోడ్డులోని దుర్గాపురం స్టేజీ వద్ద వీరు సాధారణ ప్రయాణికుల వలే నిల్చొని అటుగా వచ్చిన ద్విచక్రవాహనదారులను లిఫ్ట్ అడుగుతారు. ఇదే ముఠా సభ్యులు కిలోమీటర్ దూరంలో మరో చోట రోడ్డు మీద నిల్చొని ఉంటారు. వారి వద్దకు ఈ ద్విచక్రవాహనదారుడు వెళ్లగానే వెనుక కూర్చున్న వ్యక్తి తమ స్నేహితులు వారేనని వాహనం ఆపమని కోరుతాడు. ఆ వెంటనే వీరంతా సదరు ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేసి అతని వద్ద ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్, బంగారు వస్తువులను లాక్కొని పరారవుతారు.

బాధితుల ఫిర్యాదుతో..

జగ్గయ్యపేటకు చెందిన దుప్పల నరసింహారావు, అతని స్నేహితుడితో కలిసి ఈ నెల 11న రాత్రి 11:30 గంటల సమయంలో కోదాడ బైపాస్‌రోడ్డులోని దుర్గాపురం స్టేజీవద్ద నుంచి బైక్‌పై వెళ్తున్నారు. ఈ ముఠా సభ్యులు వారిని అడ్డగించి వారి వద్ద ఉన్న రూ.15,500 నగదు, సెల్‌ఫోన్, బంగారపు చైన్ లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిఘా పెట్టడంతో నిందితులు పట్టుబడినట్లు సీఐ వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా దుర్గాపురం జంక్షన్

కోదాడ శివారులో బైపాస్ రోడ్డు కలిసే చోట వద్ద ఉన్న దుర్గాపురం జంక్షన్ అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన అడ్డాగా మారిందనే విమర్శలు ఉన్నాయి. రాత్రి 10గంటలు దాటిందంటే ఇక్కడి నుంచి వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి మధ్య ఉన్న రెండు కిలోమీటర్లు అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంది. ప్రస్తుతం దుర్గాపురం జంక్షన్ అనంతగిరి పరిధిలో ఉండడంతో సదరు స్టేషన్ ఈ ప్రాంతానికి 10కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ ప్రాంతంపై నిఘా తగ్గిపోయింది. దీంతో ఈ ప్రాంతాన్ని కొందరు నేరగాళ్లు అడ్డాగా మార్చుకున్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో హిజ్రాల ఆగడాలు, వ్యభిచార ముఠాల కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాంతం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్నందున దీనిన టౌన్‌స్టేషన్ పరిధిలో కలిపి నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.